


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**FEBRUARY - 2017**

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

| సంపుటి - 37 | ఫిబ్రవరి - 2017 | సంచిక -7 |
|---|---|---|

## క్రీస్తు నందు దేవుని ప్రత్యక్షత

## ( Manifestation of God in Christ )

"పూర్వకాలమందు నానా సమయములలోను నానావిధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను. ఆయన దేవుని మహిమయొక్క తేజస్సును, ఆయన తత్వముయొక్క మూర్తిమంతమునై యుండి తన మహత్తు గల మాటచేత సమస్తమును నిర్వహించుచున్నాడు" అని హెబ్రీ 1:1-4లో అపో.పౌలు వ్రాసెను.

దేవుని గూర్చిన అనేక ఋజువులు ఈ లోకమందంతటా మనకు కనబడుచున్నవి. ప్రకృతిలో యున్న ఋజువులను బట్టి దేవుడు తనను గూర్చి సాక్ష్యము లేకుండ చేయలేదు (అపో.కా. 14:17). పగటికి పగలు బోధ చేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికి బాషలేదు, మాటలులేవు, వాటి స్వరము వినబడదు. లోకదిగంతముల వరకు వాటి ప్రకటనలు బయలు వెళ్ళుచున్నవి యని దావీదు మహారాజు వ్రాసెను (కీర్త 19:2-4). ప్రకృతి ద్వారా దేవుని యొక్క నిత్యశక్తియు, దేవత్వమును బయలు పరచబడు చున్నవి

(రోమా 1:20). నిజానికి దేవుడు మనందరికి ఎంత దగ్గరగా యున్నాడంటే ఆయనయందే మనము బ్రతుకు చున్నాము, చలించు చున్నాము, ఉనికిని కలిగి యున్నాము (అపొ.కా. 17:28).

అయితే ఈ విశ్వమందు మనకు కనబడు సృష్టియంతటిలోను మానవుడు తన పాపముల నుండి విమోచింపబడుట యెట్లో తెలిసి కొనుటకు సరిపడినంత సమాచారము లభించుటలేదు. అయితే మనలో ఎవని నుండి దేవుడు దూరముగ లేడు గనుక ఆయనను వెదకి కనుగొను నిమిత్తము మానవునికి సరిపడినంత ఆధారము ఈ ప్రకృతిలో లభించుచున్నది (అపొ.కా. 17:27).

"అయినను మృగములను విచారించుము, అవి నీకు బోధించును. ఆకాశ పక్షులను విచారించుము, అవి నీకు తెలియజేయును. సముద్రములోని చేపలును నీకు దానిని వివరించును" అని యోబు గ్రంథము 12:7,8లో వ్రాయబడియున్నది.

ప్రకృతిలోను, జంతువులలోను దేవుని యొక్క ఉనికి మనకు ఖచ్చితముగా కనబడుచున్నను, యేసుక్రీస్తు నందు దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిత్వమును మరింత ఖచ్చితముగా ప్రత్యక్షపరచబడినది. "ఏలయనగా దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది" యని కొలస్స 2:9లో వ్రాయబడియున్నది. అందువలన క్రైస్తవులు జ్ఞానమునకు మించిన దేవుని సంపూర్ణతను ఇప్పుడు ఎరిగినవారై యున్నారు.

ఎవడును ఎన్నడును దేవుని స్వరూపము చూడలేదు (యోహాను 5:37). గనుక కనబడని దేవుని యందు మేము విశ్వాసముంచలేము అని కొందరు చెప్పుచుందురు. అయితే ఈలోకములో యున్న ప్రాముఖ్యమైన అత్యవసరమైన గొప్ప సంగతులను మనలో ఎవడు చూచియుండలేదు కూడ. గాలిని చూచినవాడెవడు? నీవు గాని నేను గాని దానిని యెన్నడు చూచి యుండలేదు. అయితే చెట్లు తమ తలలు వంచునప్పుడు గాలి వీచు చున్నదని మన మెరుగుదుము.

అట్లే శబ్దమును, తలంపులను, ప్రేమను, విశ్వాసమును, నిరీక్షణను,

ఓర్పును, సాత్వీకమును మొదలైన వాటిని చూచిన వాడెవడు? అయితే అవి మన జీవితములో అత్యవసరమైన కొన్ని సంగతులు. అవి ఆత్మయిచ్చు ఫలములు (గలతీ 5:22).

ప్రస్తుతము మన శరీరము మనకు చాల ప్రాముఖ్యముగ కనబడుచున్నది. అయితే మన శరీరములను సజీవయాగముగా మనము దేవుని కర్పించవలసి యున్నది (రోమా 12:1). శరీరములో మనము దేవుని మహిమపరచవలసి యున్నది. అయినను మన బాహ్యపురుషుడు కృశించిపోవును, శిధిలమైపోవును, మార్పుజెందును. అయితే అంతరంగిక పురుషుడగు మన ఆత్మ మన కంటికి కనబడకపోయినను దినదినము నూతన పరచబడుచున్నాడు. ఈయాత్మ నిత్యము జీవించును(2కొరింథీ 4:16, 5:1).

అట్లే దేవునిగూర్చి మన మెరుగవలసినది ఆయన స్వరూపము, ఆకారము కాదు. అట్లయిన ఆయన వాటిని మనకు ప్రత్యక్షపరచియుండును. అయితే దేవుడు తన్ను తానే మన కొరకు బయలు పరచుకొనెను. "దేవుడు సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పు నొందెను. దేవదూతలకు కనబడెను. రక్షకుడని జనములలో ప్రకటింపబడెను. లోకమందు నమ్మబడెను. ఆరోహణుడై తేజోమయుడయ్యెను" అని పరిశుద్ధాత్ముడు 1 తిమోతి 3:16లో లిఖించెను. "ఆయన శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను; తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి". "ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్మున నున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలు పరచెను" అని భక్తుడైన యోహాను వ్రాసెను (యోహాను 1:14,18).

దేవత్వము యొుక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తు నందు నివసించుచున్నది. "అంధకారములో నుండి వెలుగు ప్రకాశించును గాక అని పలికిన దేవుడే తన మహిమను గూర్చిన జ్ఞానము యేసుక్రీస్తు నందు వెల్లడిపరచుటకు మా హృదయములలో ప్రకాశించెను. గనుక మేము మమ్మును

గూర్చి ప్రకటించుకొనుట లేదుగాని, క్రీస్తు యేసును గూర్చి ఆయన ప్రభువనియు, మమ్మును గూర్చి యేసు నిమిత్తము మేము మీ పరిచారకుల మనియు ప్రకటించుచున్నాము" అని అపో.పౌలు చెప్పుచున్నాడు (2 కొరింధి 4:16).

మనము క్రీస్తును చూచు నప్పుడు ఆయనలో ఏమి కనుగొను చున్నాము? ఆయనను చూచిన అపొస్తులులు ఆయనలో ఏమి కనుగొనిరి? వారాయన ఎత్తు, ఆకారము, శరీరఛాయ, తలవెంట్రుకల మొదలగు లక్షణములను బట్టి అపొస్తులులలో ఎవడును ఆయన యొద్దకు వచ్చి యుండలేదు. వారిలో ఏ ఒక్కడును యేసు యొక్క శరీరాకారములను మనకు ఎన్నడు వర్ణించి యుండలేదు. ఆయన భౌతిక ఆకారమును గూర్చి వ్రాయుటకు పరిశుద్ధాత్ముడు వారిలో ఎవరిని ప్రేరేపించలేదు. ఎందువలన? దేవుడు భౌతిక ఆకారమునకు ఏమియు ప్రాముఖ్యత నిచ్చుటలేనందు వలన. అందుకే కాబోలు కెమేరాలు కనిపెట్టబడక ముందే యేసుక్రీస్తును ఆయన ఈ లోకమునకు పంపించెను. మనము జ్ఞాపకముంచుకొనవలసినది ఆయన భౌతిక ఆకారమును కాదుగాని ఆయన ఆత్మీయ స్వరూపమును.

నిజానికి ఇప్పుడు మనము క్రీస్తును గూర్చి యెరిగిదనది యేమిటి? ఆయన ఆత్మీయ స్వరూపమును చూచినప్పుడు దేవునిని చూతుము. అందుకే "నన్ను చూచినవాడు తండ్రిని చూచి యున్నాడు.. తండ్రి యందు నేనును, నాయందు తండ్రియు ఉన్నాము" అని యేసుబోధించెను (యోహాను 14:9,10). అందువలన యేసుక్రీస్తును మనము చూచిన యెడల అదృశ్యుడైన తండ్రిని మనము చూడగలము.

నేనును, తండ్రియు ఏకమై యున్నామనుటలో, నేను దేవుడునై యున్నాను అని యేసు బోధించెను. అట్లు బోధించుటయే కాదు. ఆయన దేవునివలె జీవించెను. మనుష్యుల జీవితములలో పాపమును ఆయన ఖండించెను. మనుష్యులు మారు మనస్సు పొందవలెనని బోధించెను. అయినను ఆయన పలికిన మాటను బట్టిగాని, చేసిన క్రియను బట్టిగాని దేనిని గూర్చియు ఆయన పశ్చాత్తాప పడలేదు; సరిగదా, "నాలో పాపము

న్నదని మీలో ఎవడు స్థాపించును?" అని ఆయన ఛాలంజి చేసెను (యోహాను 8:46).

యేసు పరిశుద్ధుడు. మనము ఆయన సన్నిధి చేరవలెనంటే మనల నుండి పరిశుద్ధతను కోరుచున్నారు. "నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులై యుండుడి" (1పేతురు 1:16). "పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు" (హెబ్రీ 12:14) అని ఆయన చెప్పుచున్నారు.

యేసుక్రీస్తు ద్వారా ఆ పరిశుద్ధతను మనము పొందగలము. తండ్రియైన దేవుని యొద్దకు మనలను చేర్చుటకే ఆయన ఈ లోకమునకు వచ్చెను. క్రీస్తు దేవుని కుమారుడని నమ్ముకొనండి, మీ పాపముల విషయమై మారుమనస్సు నొందండి, క్రీస్తు ప్రభువని నోటితో ఒప్పుకొని నీటిలో ముంచడము బొంది పరిశుద్ధులు అవ్వండి.

క్రీస్తులోనికి బాప్తిస్మము పొంద వలెనని కోరుచున్నయెడల మీకు సమీపముగా యున్న క్రీస్తు సంఘమును దర్శించండి.

"క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" (రోమా 16:16)

## దేవునికి అసాధ్యమైనది యేదైనా యున్నదా?

## (Is anything too hard for the Lord ?)

తాను కుమారుని కనబోవుచున్నదని చెప్పబడిన ప్రవచనము శారా శంకించినందున, "యెహోవాకు అసాధ్యమైనది యేమైనా కలదా? మీదటికి ఈ కాలమున నిర్ణయ కాలమందు నీయొద్దకు తిరిగి వచ్చెదను. అప్పుడు శారాకు కుమారుడు కలుగునని'' ఆమె హెచ్చరింపబడెను (ఆది.కా. 18:14). దేవుడు చెప్పిన రీతిగానే ఆయన వాక్యము నెరవేరెను. మరుసటి సంవత్సరమునకు ఇస్సాకు జన్మించెను. దేవుడు అబ్రాహాముకు వాగ్దానము చేయుసరికి అతడు సంతానహీనుడైనను, అతడు గొప్ప జనాంగమాయెను (ఆది.కా. 12:2, 15:3,4).

పై ప్రశ్నకు ఇతరులు జవాబును కనుగొనిరి. నీవు శంకించుచున్న యెడల దిగువ వాస్తవములను గమనించుము.

– గొప్పజల ప్రళయము నుండి నోవహును అతని కుటుంబము మాత్రమే ఓడ ద్వారా రక్షింపబడిరి (ఆది.కా.6–8).
– యెహోషువా, యెరికోగోడలు (యెహోషువా 6 అధ్యాయం)
– యోర్ధానులో ఏడుమారులు మునిగి శుద్ధుడైన నయమాను (2రాజులు 5)
– యేసుప్రభువు సమస్తమును బాగు చేయుచున్నాడని గుర్తించిన ప్రజలు (మార్కు 7:37).
– తమ సోదరుడు మృతుడైనను తిరిగి జీవింపజేయబడుట చూచిన మార్త, మరియలు (యోహాను 11).
– తాను యేసును గూర్చి బొంకినను, పేతురును యేసు క్షమించుట (యోహాను 21:15–17).
– తిరిగి లేచిన యేసును చూచిన సహోదరులు (1 కొరింథీ 15:5–8).
– ప్రతివాడు తన స్వభాషతో సువార్త బోధింపబడుట వినిన జన సమూహములు (అపో.కా. 2అ).
– పరిశుద్ధ పరలోక పట్టణమును చూచిన అపో. యోహాను (ప్రకటన 21).

నరకమునకు పోవుచున్న జారులు, వ్యభిచారులు, దూషకులు, హింసకులు, హంతకులు మొదలగు వారిని దేవుని రాజ్యమునకు వారసులుగా దేవుడు చేస్తారు. యిది పరిశుద్ధాత్మ పని ద్వారా సాధ్యమగును (1కొరింథీ 6:9–13). మనము పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందితే యిది సాధ్యమగును.

దేవుడు అంతశక్తివంతుడైతే ఆయన మనకు కావలసిన వన్నీ ఎందుకు చేసేయరు? అల్లావుద్దీన్ అద్భుత దీపము కథవలే అన్నీ ఆయన మనకు ఎందుకు చేయరు? మన సమస్యలు ఎందుకు తీరడంలేదు? నిర్లక్ష్యముగా యున్న ప్రజలతో యెషయా ఇట్లు చెప్పుచున్నాడు, "రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురచకాలేదు మీ దోషములు మీకును, మీ దేవునికి అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను గనుక ఆయన ఆలకింప కున్నాడు" (యెషయా 59:1–2). దేవుడు కోరికలు తీర్చువాడు కాడు, అయినను దేవుని ప్రేమించువారికి మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగును" (రోమా 8:28).

–డేన్ వీలర్

# యేసు నరావతారుడు కాకముందే దేవుడు

## ( Jesus as Pre-Incarnate God )

I. పరిచయము :

1. యేసు ఈ లోకమున కరుదెంచక ముందునుండే ఉండియుండెను. ఆయన మానవతారిగా రాకముందు నుండే దేవుడై యుండెను, అట్లెరుగబడి యుండెను. కన్యమరియ గర్భమున ఉద్భవించిక ముందునుండే ఆయన యుండెను.

2. దైవత్వములోని రెండవమూర్తి ఈ లోకమునకవతరించక ముందు యేసుక్రీస్తు పాత్రను కలిగి యుండలేదు.

కైసరు ఔగుస్తుకు ముందు మెస్సీయ, క్రీస్తు, దేవుని కుమారుడు, అద్వితీయ కుమారుడు అను పదములు లేవు. క్రైస్తవ యుగమునకు ముందు తండ్రి, కుమారుల సంబంధము పెద్దగా నిర్వచింపబడలేదు గాని యోహాను 1:1లో యెహాను దానిని నిర్వచించాడు. అక్కడ దేవుడు, దేవుని వాక్యము అనే సంబంధము ఉచ్చరింపబడినది. ఈ సంబంధము తండ్రికుమారుల అత్యంత సన్నిహిత సంబంధమును వ్యక్తపరచు చున్నది. ఇద్దరు సర్వసమానులే, సన్నిహితులే, మహిమాన్వితులే (అలెగ్జాండర్ గ్రహంబెల్).

3. తండ్రితోను, పరిశుద్ధాత్మునితోను కలసిచేసిన సృష్టివలన క్రీస్తు యొక్క పూర్వపు ఉనికి ప్రశ్నింప తగని సత్యము (ఆదికా 1:26-27, కొలస్స 1:15-17).

4. యేసుక్రీస్తు యొక్క పూర్వపు ఉనికి లేఖనములలో కూడ బోధింప బడినది. యేసుక్రీస్తును గూర్చిన పఠనము ఏదైనా ఆయన 33 సంవత్సరముల భూనివాసమే గాక, ఆయన నిత్య ఉనికిని గూర్చికూడ యుండవలెను. మన రక్షకుడు ఈ లోకమునకవతరించక ముందు నిత్య ఉనికి కలిగియున్నారని బైబిలు విపులముగా బోధించుచున్నది" (జాక్సన్).

5. గనుక పూర్వము నుండి యున్న దేవుడైన యేసును కనుగొనాలని ఈ పాఠము మిమ్మును ఆహ్వానించు చున్నది.

ప్రధానాంశము :

1. యేసుక్రీస్తు మొదటి నుండి ఉనికి కలిగియున్నవాడని పాతనిబంధన బోధించుచున్నది.

**ఎ. సృష్టి జరిగించుటలో తండ్రితోను, పరిశుద్ధాత్మతోను కలసి దైవత్వము లోని రెండవ వ్యక్తి పాలుపొందెను గనుక ఆయన పూర్వము నుండి యున్నవాడు.**

1. దేవుడే లోకమును సృజించెను (ఆదికా 1:26-27, రోమా 1:20)

2. ఈలోకమును సృజించుటలో యేసుక్రీస్తు ముఖ్యపాత్రను వహించెను (1కొరింథీ 8:16; ఎఫెసీ 3:9; కొలస్స 1:15-17; యోహాను 1:1-3).

**బి. పాత నిబంధన ప్రవచనములు యేసుక్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని చాటుచున్నవి. మీకా 5:2లో ఇశ్రాయేలును ఏలబోవువాడు నీలో నుండివచ్చును. పురాతన కాలము మొదలుకొని శాశ్వత కాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను" అని చెప్పబడెను.**

1. బెత్లేహేములో యేసు జన్మించునని మీకా ప్రవచించినప్పుడు ఆయన పురాతన కాలము నుండి శాశ్వత కాలము ప్రత్యక్షమగుచుండెనని చెప్పుటలో జాగ్రత్త వహించెను. ఆయన శాశ్వతకాలము ప్రత్యక్ష మగుటయే కాక యూదయ బెత్లేహేములో ఒక శిశువుగా జన్మించునని చెప్పబడెను. ఆయన నిత్యత్వమును గూర్చి తెలియ జెప్పుటకు ఈ మాటలు వినియోగింప బడెను.

2. పాత క్రొత్త నిబంధన ప్రవచనములను తరచి చూచిన దానియేలు 7:13-14 వచనములలో దేవుడు భూమి మీద నివాసముండుటకు ఏతెంచిన విధానము గ్రహింపగును. కన్య గర్భము ద్వారా ఆయన ఈలోకము నకుద్భవించెను (యెషయా 7:14; యోహాను 1:1-3,14; గలతీ 4:4).

3. యేసుక్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని గూర్చిన ప్రవచనములను అపొ. పేతురు ఎత్తిచూపించెను (1పేతురు 1:10-11). ప్రవక్తలలో క్రీస్తు యొక్క ఆత్మ ఉండినందున, వారి కాలము లో క్రీస్తు ఉండియుండెను. అది క్రీస్తు యొక్క దైవత్వమును రూఢి పరచుచున్నది.

**II. క్రొత్త నిబంధన లేఖనములు యేసుక్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని గూర్చి తెలియ జేయుచున్నవి.**

1. క్రీస్తు తానే తన పూర్వపు ఉనికిని గూర్చి వక్కాణించారు.

ఆయన భూసంబంధమైన ఆరంభము, తత్వము కంటె ఉన్నతుడు. "మీరు క్రింది వారు" అని తరుచు యూదులకు ఆయన ఉద్భోదించారు (యోహాను 8:23). "నేను పై నుండు వాడను, మీరు ఈ లోకసంబంధులు నేను ఈలోక సంబంధుడను కాను" (యోహాను17:16 పోల్చిచూడుము). అందువలన మనుష్యకుమారుడైన ఆయన "పరలోకమునుండి దిగి వచ్చినవాడు" (యోహాను 3:13). అది ఆయన నివాసము. ఇందును బట్టి ఆయన ఈ లోకమునకు రాక ముందునుండే యున్నవాడు. ఆయన ఈ పూర్వపు ఉనికి వివరముగా వక్కాణించ బడినది. "అలాగైతే మనుష్య కుమారుడు మునుపున్న చోటునకు ఎక్కుట మీరుచూచిన యెడల ఏమందురు?" (యోహాను 6:62). ఆయన పూర్వము నుండి మాత్రమే గాక నిత్యత్వము నుండి ఉనికి కలిగియుండెను. గనుక ఆయన ఇట్లు ప్రార్థించారు. "తండ్రీ లోకము పుట్టకమునుపు నీ యొద్ద నాకు ఏ మహిమ యుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీ యొద్ద మహిమపరచుము" (యోహాను 17:5,24). అందుకే "అబ్రాహాము పుట్టక ముపుపే నేను ఉన్నాని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహాను 8:57).

2. ఆయన పరలోకసంబంధినని చెప్పుచు యేసు తాను పై నుండి వచ్చిన వానినని తరుచు ఉద్ఘాటించారు. మరియు ఆయన చనిపోవకముందు తండ్రి యొద్ద లోకము పుట్టకమునుపు తనకున్న మహిమను గూర్చి ప్రార్థించారు. "తండ్రీ, లోకము పుట్టక మునుపు నీ యొద్ద నాకు ఏమహిమ యుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీ యొద్ద మహిమ పరచుము" (యోహాను 17:5).

3. ఈ లోకమును విడిచి తండ్రి యొద్దకు తిరిగి వెళ్లుటలో ఆయన తండ్రి యొద్దకు వెళ్లకమునుపు ఈ లోకములో యున్నారు. అది వాస్తవము. గనుక తండ్రి యొద్ద నుండి ఈ లోకమునకు వచ్చుటలో ఆయన తండ్రితో కూడ పరలోక మందుండెను. యిది క్రీస్తు యొక్క

పూర్వపు ఉనికిని నిర్ధారించు చున్నది. ఆయన కన్యమరియకు బెత్లేహేములో జన్మిమించక ముందు నుండే ఉండియుండెను. ఆయన ఎల్లప్పుడు ఉండెను (రాయ్ హెచ్.లైనిర్).

**బి. అపొస్తులుడైన యోహాను యేసు క్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని గూర్చియు, నరావతారమెత్తక ముందు నుండే ఆయన ఉనికి కలిగి యున్నారని బోధించెను.**

1. క్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని గూర్చి చెప్పునది యోహాను సువార్త ఒక్కటి మాత్రమేయని అనేకులు తలంతురు.

"యేసుక్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని గూర్చి తెలియజేయునది యోహాను సువార్తమాత్రమే"యని విన్క్లర్ అనువాడు చెప్పాడు.

"యోహాను సువార్త క్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని బోధించుచున్నది" (క్రిష్టియాలజీ).

2. యోహాను లోగోస్ అను గ్రీకు పదమును ప్రత్యేకముగా ఉపయోగించాడు. అది క్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని చెప్పుచున్నది (యోహాను 1:1-3;14)

3. అపొ. యోహాను యేసుప్రభువు బాప్తిస్మము పొందిన సందర్భములో బాప్తిస్మమిచ్చు యోహాను చెప్పిన మాటలను రికార్డుచేసెను. అవి యేసు యొక్క పూర్వపు ఉనికిని సూచించుచున్నవి. "నా వెనుక వచ్చువాడు కంటె ప్రముఖుడు గనుక ఆయన నా కంటె ముందటి వాడాననియు, నేను చెప్పినవాడు ఈయనే అనియు ఎలుగెత్తిచెప్పెను" (యోహాను 1:15).

బాప్తిస్మమిచ్చు యోహాను యేసుకంటె ఆరునెలలు ముందుగా జన్మించెను గాని యేసు యోహాను కంటె ముందునుండే యుండెను. ఆయన నిత్యవాక్యమై యుండెను. గనుక యేసు యొక్క నిత్యత్వమును గూర్చి యోహాను ఇక్కడ వర్ణించెను (మైగ్రావి).

4. 1యోహాను 1:2లో యోహాను యేసు యొక్క పూర్వపు ఉనికిని ఆయన తదుపరి అవతారమును వక్కాణించాడు. ఆయన నరావతారమెత్తకముందు తండ్రియొద్ద ఉండెను. నిత్యము ఉండియుండెను.

యేసుప్రభువు దేవుడు అని చెప్పు ప్రతిలేఖన భాగము దైవత్వములోని మిగతాయిద్దరుమూర్తుల వలె నిత్యుడని తెలియజేయుచున్నది.

యేసు శరీరాకారమును ధరించె ననగా ఆయన పూర్వపు ఉనికిని, నిత్యత్వమును ఉద్ఘాటించుచున్నది (యోహాను20:28; అపొ.కా.20:28).

**సి. అపొ.పౌలు క్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని, పూర్వావతారమును గూర్చి తరుచు బోధించెను.**

1. క్రీస్తు శరీరాకారముతో ఈలోకమునకు రాకముందు భూసంబంధ ప్రక్రియలో పాల్గొనెనని పౌలు బోధించెను (1కొరింథీ 10:4,9) క్రీస్తు ఇశ్రాయేలీయులను ఆత్మీయముగా బండవలె వెంబడించెనని 1కొరింథీ 10:9లో చెప్పబడినది. ఇశ్రాయేలీయులను నిజానికి వెంబడించినది బండ కాదు గాని క్రీస్తే. అది వారి అరణ్య యాత్రలో వెంబడించిన దేవునిదూత. మన పితరులు ఆయనకు లోబడనొల్లరి (అపొ.కా. 7:38-39).

పౌలు చెప్పిన బండ యేసుక్రీస్తే. బండలోనుండి అరణ్యములో మోషే నీళ్ళురప్పించగా ఇశ్రాయేలీయులు ఆ బండలోని నీళ్ళను నిజముగా త్రాగిరి (నిర్గమ 17:5). అయితే ఇక్కడ అంతకన్నా ఎక్కువ దృశ్యమగుచున్నది. ఆ బండక్రీస్తే. యిది క్రీస్తుయొక్క పూర్వపు ఉనికి యొక్క రుజువైయున్నది.

2. II కొరింథీ 8:9ని ఆలోచించుము : "మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను". యేసు ధనవంతుని వలె పూర్వము ఉండియుండనియెడల ఆయన ఎప్పుడు అట్లుండెను? భూమిమీద యున్నప్పుడు మాత్రము కాదు. ఆయన పశువుల పాకలో జన్మించెను, తనదికాని నావలో గలిలయ సముద్రములో సంచరించెను. ఒకని యొద్ద అడిగి పుచ్చుకొనిన ఆహారముతో వేలకొలది జనసమూహములకు ఆహారము నిచ్చెను. ఎరువు తెచ్చుకొనిన గాడిద పై యెరూషలేములో ప్రవేశించెను. వేరొకని సమాధిలో పాతిపెట్టబడెను. "నక్కలకు బొరియలును, ఆకాశపక్షులకు నివాసములును కలవుగాని మనుష్యకుమారునికి తలవాల్చుట కొనుటకైనను స్థలము లేదు" (లూకా 9:58).

3. ఫిలిప్పీ 2:5-11 లేఖనభాగము యేసుయొక్క పూర్వపు ఉనికిని గూర్చి, నరావతారమును గూర్చి

ప్రత్యక్షముగా చెప్పుచున్నది. ఈ లేఖనభాగములో అపో. పౌలు యేసుయొక్క పూర్వపు ఉనికిని, నరావతారమును, పట్టాభిషేకమును గూర్చి చెబుతాడు. ఆయన దేవునితో సమానుడు, మనుష్య రూపముదాల్చారు, అందరికంటె ఉన్నతునిగా హెచ్చింపబడ్డారు. అదేరీతిగా హెబ్రీ లేఖకుడు ఆయన ద్వారా ప్రపంచములు నిర్మించ బడెను అనగా ఆయన పూర్వము నుండి యుండెను. పాపములకు శుద్ధీకరణము తానేచేసారు (రోమా 8:3). అనగా నరావతారమెత్తారు మరియు దేవుని కుడి పార్శ్వమును ఆశీనుడైయున్నారు (హెబ్రీ 1:2,3).

III. యేసుక్రీస్తుకు ఆపాదించబడిన ఇతరక్రియలకు ఆయన పూర్వపు ఉనికికి గల సంబంధము యేమిటి?

ఎ. యేసుక్రీస్తు ఈ లోకము నకవతరించ కముందు ఎట్టిపాత్ర కలిగియుండెను?

1. యేసుక్రీస్తు సృష్టిక్రియలో పాల్గొనెను (ఆదికా. 1:26-27); యోహాను 1:1-3; హెబ్రీ 1:2-3).

2. యేసుక్రీస్తు ఇశ్రాయేలీయులు అరణ్యములో ప్రయాణించుచుండగా వారితో సంచరించెను (1కొరింధీ 6:4,9).

ఇశ్రాయేలీయులందరు అరణ్యము గుండా ప్రయాణించుచున్నప్పుడు యేసుక్రీస్తు వారిని ఆత్మీయముగా తననోటి మాటద్వారా సంరక్షించుచు వచ్చెను (యాపిల్‌బర్రి 183).

బి. నరావతారమెత్తిన తరువాత యేసు ఎట్టిపాత్ర కలిగియుండెను?

1. యేసు నశించిన దానిని వెదకి రక్షించుటకు వచ్చెను (లూకా 19:10).

2. దీనిని ఆయన పరిచర్యద్వారా, సిలువ మరణము, సమాధి, పునరుత్థానము, ఆరోహణము ద్వారా ఆయన సాధించెను (1కొరింధి 15:3-4; మార్కు 16:19).

3. యేసు ఈలోక రక్షకుడాయెను (1 యోహాను 4:14).

సి. యేసు పరమున కారోహణమైన తరువాత ఆయన పాత్రయేమిటి?

1. యేసుక్రీస్తు మధ్యవర్తి, ఉత్తరవాది (1తిమో 2:5; హెబ్రీ 7-25).

2. యేసు మరల వచ్చి రక్షింపబడిన

వారిని కొనిపోవును (యోహా 14:3).

3. ఆయన మరల వచ్చునప్పుడు అవిధేయులను శిక్షించును (హెబ్రీ 10:29-30; 2 థెస్స 1:7-9).

4. అన్ని కాలములలో యున్న మానవ జాతికంతటికిని యేసుక్రీస్తు తీర్పు తీర్చును (యోహాను 5:28-29).

**ముగింపు :**

యేసుప్రభువు నిత్యత్వము నుండి దేవుడై యుండెను. శరీరావతారియైనను కూడ ఆయన దేవుని స్వరూపము గలవాడై, దేవునితో యుండెను. దైవ సమానుడైయుండెను. దేవుడై యుండెను (ఫిలిప్పీ 2:6; యోహాను 1:1-3). తండ్రితో సమాన మహిమను కలిగియుండెను (యోహాను 17:5). రక్షకునిగా యుండుటకు వీటిని త్యజించెను.

1. క్రీస్తు తన తండ్రియొక్క వర్తమానకునిగా లేక దూతగా, తండ్రిచేత పంపబడెను. పితరులకు ఆయన దర్శనమిచ్చినప్పుడు యెహోవా దూతగా పలుకబడెను.

2. క్రీస్తు ఈలోకమునకు వచ్చినప్పుడు దైవత్వమును త్యజించి, తన పూర్వపు మహిమను కూడ విడిచి వచ్చెను (యోహాను 17:4-5; 2 కొరింథీ 8:9).

3. లేఖనముల యొక్క పరిరక్షకులును సొత్తుదారులైన యూదులు యేసు యొక్క పూర్వపు ఉనికిని వక్కాణించిరి.

4. గనుక మరియ కుమారుడైన యేసు యొక్క దైవత్వాన్ని నిరాకరించు ఏ దృక్పథమైనను లోప భూయిష్టమైనదే.

**ఆహ్వానము :**

1. యేసు మొదట ఈ లోకమునకు వచ్చినప్పుడు "దేవుడు తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకమునకు తీర్పుతీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు" (యోహాను 3:17).

2. అయితే యేసు రెండవసారి వచ్చినప్పుడు ఆయన రక్షింపబడిన వారిని తనలో చేర్చుకొని, నశించిన వారిని శిక్షించును హెబ్రీ 5:8-9; 1థెస్స 4:13-18; 2థెస్స 1:7-9).

3. యేసు మరల వచ్చినప్పుడు నిన్ను యేమిచేయును? (మార్కు 16:16; 1 యోహాను 1:9).

– లూయిస్ రష్‌మోర్

# ఆయన మహాత్మ్యము

## ( His Majesty )

"చమత్కారముగా కల్పించిన కధలను అనుసరించి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క శక్తిని ఆయన రాకడను మేము మీకు తెలుపలేదు గాని ఆయన మహాత్మ్యమును మేము కన్నులారా చూచినవారమై తెలిపితిమి" యని పేతురు వ్రాసాడు (2పేతురు 1:16-17). మహాత్మ్యము అనుమాట గొప్పతనమును, గంభీరతను సూచించు చున్నది. యిదే మాట లూకా 9:43 లోను, అపొ.కా.19:27 లోను వాడబడినది. గొప్పతనము, ఘనత యనునది దీని మూలపదము. అది లూకా 1:49లోను, అపొ.కా. 2:11లోను వాడబడినది. దేవుని గొప్ప కార్యములను గూర్చి అక్కడ చెప్పబడినది. లూకావాడిన పదమునే పేతురు వాడినప్పుడు, యేసు కొండ మీద పేతురు యాకోబు, యోహానుల యెదుట రూపాంతరము పొందిన దృశ్యమును గూర్చి ఉద్దేశించి యున్నాడు (2పేతురు 1:17,18). యేసు యొక్క మహాత్మ్యమును గూర్చి మనం ఆలోచించవలసినది కొంత యున్నది. దిగువ తలంపులను గమనించుము.

దేవుని యొక్క స్వభావము : యేసు యొక్క దైవత్వాన్ని ప్రకటించు అనేక వాక్యములతో క్రొత్త నిబంధన నిండియున్నది. "ఆయన దేవుని స్వరూపము కలిగిన వాడైయుండి దేవునితో సమానముగా ఉండుట విడిచి పెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు" అని ఫిలిప్పీ 2:6లో పౌలు వ్రాసాడు. మరల "పూర్వకాల మందు నానాసమయములలోను, నానావిధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను" (హెబ్రీ 1:1-2). "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడైయుండెను. " ఆ వాక్యము శరీరధారియై కృపా సత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను" అని యోహాను వ్రాసెను (యోహాను 1:1,14). ఈ వాస్తవాన్ని గ్రహించు కోలేని మతములు, మానవ తలంపులు రక్షణయొక్క ప్రాముఖ్యసూత్రాన్ని ఈ జీవితంలో గ్రహించకోలేవు. గనుక "మీరు మీ పాపములలోనే యుండి మరణింతురు; నేనాయనననని మీరు

విశ్వసింపని యెడల మీరు మీ పాపములలోనే మరణింతురని" యేసు చెప్పెను (యోహాను 8:24).

**ఆయన అధికారము యొక్క ఔన్నత్యము :** పేతురు యాకోబు యోహానులు చూచుచుండగా యేసు రూపాంతరము పొందిన దినమున ఆ కొండపై యేసుతోకూడ మరియిద్దరు మనుష్యులుండిరి. "మరియు ఇద్దరు పురుషులు ఆయనతో మాటలాడు-చుండిరి, వారు మోషే, ఏలియా అనువారు వారు మహిమతో అగపడి ఆయన యెరూషలేములో నెరవేర్చ బోవు నిర్గమమును గూర్చి మాటలాడు చుండిరి" (లూకా 9:30-31). ఈ ముగ్గురు వ్యక్తులకు మూడు పర్ణశాలలు కడుదుమని పేతురు సలహాయిచ్చు చున్నప్పుడు ఆకాశమునుండి యొక శబ్దము, "ఈయన నేనేర్పచుకొనిన నా కుమారుడు, ఈయన మాటవినుడని" చెప్పెను (లూకా 9:35). మోషే, ఏలియాల యొక్క అధికారమును తండ్రి ఇక్కడ కాదనలేదు గాని, వారికంటే యేసు ఘనుడని వారికి తెలియ జేసెను. అందువలనే "మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి యే నామమున రక్షణ పొందలేమని" పేతురు తెలియజేసెను (అపో.కా. 4:12). అంత్య దినమునందు యేసు యొక్క అధికారమే మనుష్యులకు తీర్పు తీర్చును (యోహాను 12:48).

**మానవుని పై దాని ప్రభావము :** తానును మిగతా అపొస్తులులును చమత్కారముగా కల్పించిన కధలను అనుసరించుట లేదని పేతురు వివరించాడు (2పేతురు 1:16). అనేక మతములు మానవ కల్పితములపై ఆధారపడి యున్నవి (రోమా 1:21-25; 2కొరింధీ 10:5). అయితే "ఇంతకంటే స్థిరమైన ప్రవచన వాక్యము మనకున్నది, తెల్లవారి వేకువ చుక్క మీ హృదయములలో ఉదయించు వరకు ఆ వాక్యము చీకటిగల చోటున వెలుగిచ్చు దీపమైనట్టున్నది; దాని యందు మీరు లక్ష్యముంచిన మీకు మేలు" అని పేతురు విశదీకరించాడు (2పేతురు 1:19). ఈ సాక్ష్యములు పరిశుద్ధాత్మ సహాయము వలన భద్రపరచ బడియున్నవి (2పేతురు 1:20,21). యేసు యొక్క గొప్ప మహాత్మ్యముతో మన విశ్వాస నిరీక్షణ ముడిపడి యున్నది.

– జిమ్మీక్లార్క్

# నీకు నీవే నిశ్చయించుకో
## ( Choose for your self )

"యెహోవాను సేవించుట మీ దృష్టికి కీడని తోచిన యెడల మీరు ఎవని సేవించెదరో, నది అద్దరిని మీ పితరులు సేవించిన దేవతలను సేవింతురో అమోరీయుల దేశమున మీరు నివసించుచున్నారే వారి దేవతలను సేవించెదరో నేడు మీరు కోరుకొనుడి; మీరెవరిని సేవించ కోరుకొనినను నేనును నా యింటి వారును యెహోవాను సేవించెదము" (యెహోషువ 24:15).

**మానవునికి ఎంచుకొనే శక్తి యున్నది :** మానవుని దేవుడు అట్లు సృజించారు. అతడొక మర యంత్రము కాదుగాని మంచిగాని, చెడుగాని చేయుటకు నిశ్చయించుకొనగలడు. తానెట్లు జీవించగోరునో దానిని మానవుడు ఎంచుకొనవచ్చును. యెహోషువ తన దినముల అంత మందు, ప్రజలకున్న ఎంపిక శక్తిని గూర్చి జ్ఞాపకము చేసాడు. మానవుడు చేయు ప్రతి నిర్ణయముకు కొన్ని పర్యవసానములు లేక దీవెన లుంటాయని అతడు తెలిసికొనవలెను. పాపము చేయుటకు మానవుడు ఎంచు కొంటే, పాపమువలన వచ్చు జీతము మరణము. గాని మానవుడు యేసును ఎంచు కొంటే, దానికి నిత్యజీవము కలదు.

**ఆ ఎంపిక ఈనాడే చేయవలెను :** "ఏదో ఇక రోజున నేను క్రైస్తవుడ నవుతానని" కొందరు చెబుతారు. "ఏదో ఒకరోజున నేను మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుతాను" అని మరికొందరు చెబుతారు. యేసును నీవు ఈ రోజు ఎంచుకోకపోతే, వేరే ఒక దేవునికి సేవచేయుటకు నీవు ఎంచుకొన్నావు. యేసును వెంబండించని వారందరు వేరే ఇంకొకని వెంబడించుచున్నారు. మనము లేచు ప్రతిదినము ఒక నిర్ణయం తీసుకొంటాము. ఈ రోజు నీవెవరిని వెంబడిస్తావు? మారు మనస్సు పొందువారందరికీ ఈనాడే రక్షణ దినము!

**యెహోషువ మంచి నిర్ణయాన్ని గైకొన్నాడు :** తానును తన యింటి వారును యెహోవాను సేవింతురని చెప్పాడు. అతడు ధైర్యము గలవాడు. విశ్వాసము గలవాడు. యెహోవాయే సజీవుడైన ఏకైక దేవుడని యెహోషువా ఎరుగును. ఈ దేవుడు వారిని ఐగుప్తు బానిసత్వము నుండి విమోచించారు. తాను ఎంచుకొన్న దేవుడు వారిని అరణ్యములో నలుబది సంవత్సరములు పోషించాడు. ఈ దేవుడు వారిని పాలు

తేనెలు ప్రవహించు దేశమునకు నడిపించిన వాడు. దేవుడు వారిని పోషించి సంరక్షించాడు.

నీవు ఈ రోజు ఒక నిర్ణయమునకు రావాలి : నీవు ధనాన్ని, సుఖాన్ని, విలాసాన్ని సేవిస్తావా? నీవు ఈ లోక సృష్టికర్తయైన నిజదేవుని సేవిస్తావా? ఈ రోజే యేసుక్రీస్తును నీవు ఎంచుకోవాలని హెచ్చరించు చున్నాను. ఆయనయందు విశ్వాసముంచుము. పాపముల విషయమై మారుమనస్సు పొంది, బాప్తిస్మము పొందుము (అపో.కా. 2:38; 3:19). నీవాయన విశ్వాసములో నుండి తొలగిపోయిన యెడల ఈ రోజే మారుమనస్సు పొంది క్షమాపణ కొరకు ప్రార్థించుము (అపో.కా8:22). ఆయన యొద్దకు తిరిగివచ్చి ఆయనను సేవించుము. నీవు దీవించబడ్తావు!!

-లోయ్‌మిచెల్

## శిష్యత్వపు బాధ్యతలు
## ( Demands of Discipleship)

గొప్ప బాధ్యతలు కోరుచున్న యుగంలో మనము జీవించుచున్నాము. ఉద్యోగంలోను, గృహంలోను మనము అనేక బాధ్యతలు ఎదుర్కొనుచున్నాము. శిష్యత్వపు బాధ్యతలు కూడయున్నావని క్రైస్తవులు గ్రహించాలి. మనకు శిష్యులమయ్యే హక్కు లేకపోయినప్పుడు మన పాపములకు పరిపూర్ణ బలి అర్పించే బాధ్యతను దేవుడు నెరవేర్చ వలసి యుండెను. ఈ బలి 1పేతురు 1:19లో వర్ణించబడెను. “అమూల్యమైన రక్తముచేత అనగా నిర్దోషమును నిష్కళకంమునగు గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తముచేత మీరు విమోచింపబడితిరని మీారెరుగుదురు గదా”.

శిష్యుడు అనగా వెంబడించువాడు, నేర్చుకొనువాడు, మనం క్రీస్తు యొక్క శిష్యులుగా యుండాలంటే కొన్ని షరతులు నెరవేర్చాలి, వాటిని గూర్చి బైబిలు యేమి చెప్పుచున్నదో చూద్దాం.

మొదటిగా, మనం మనుష్యులను పట్టుజాలరులుగా యుండాలి. యేసు పేతురును, అంద్రెయను శిష్యులుగా పిలిచినప్పుడు, “నన్ను వెంబడించుడి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులుగా చేతునని” చెప్పెను. నీవు మనుష్యులను పట్టుజాలరిగా యుండ గోరితే నీవు ఉద్యోగస్థుడవే.

రెండవదిగా, శిష్యులుగా యుండగోరితే మనం క్రీస్తువలె యుండాలి. మత్తయి 10:25లో

"శిష్యుడు తన బోధకుని వలెను దాసుడు తన యజమానునివలెను ఉండిన చాలును" అని యేసుచెప్పారు. నీవు క్రీస్తువలె యుండుటకు యేమి చేయుచున్నావు?

మూడవదిగా, నీవు శిష్యునిగా యుండ గోరితే కొంత ఘర్షణ యుండును. లూకా 14:26లో యేసు "ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని భార్యను పిల్లలను, అన్నదమ్ములను అక్క చెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు" అని చెప్పెను. మన కుటుంబ సభ్యుల కంటే క్రీస్తును మనం ఎక్కువ ప్రేమించాలి. దీనివలన కొంత ఘర్షణ తప్పక ఉద్భవిస్తాది.

నాల్గవదిగా, శిష్యుడు తన సిలువ నెత్తుకొనాలి. మత్తయి 10:38లో యేసు, "తన సిలువ నెత్తుకొని నన్ను వెంబడింపని వాడు నాకు పాత్రుడు కాడు. తన ప్రాణము పోగొట్టుకొనువాడు దాని దక్కించు కొనుననని'' చెప్పెను. మొదటి శతాబ్దములో ఎవడైనను సిలువను మోయుచున్నట్లు అగపడితే వాడు సిలువ వేయబడుటకు కొనిపోబడు చున్నాడని యర్థము. నీవు నీ సిలువను మోస్తే పౌలు వలె, "క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను, దురాశలతోను సిలువ వేసియున్నారని" చెప్పగలరు (గలతీ 5:24).

ఐదవదిగా, శిష్యుడు నేర్చుకొను వాడైయుండాలి. లూకా 11:1లో శిష్యుడొకడు యేసునొద్దకు వచ్చి, "ప్రభువా, మాకు ప్రార్థన చేయనేర్పు మని" అడిగెను. వారు నేర్చుకొన గోరారు. నాటికి నేటికి ఎంత వ్యత్యాసమో! మరల "మీరు నా వాక్య మందు నిలిచినవారైతే, నిజముగా నాకు శిష్యులై యుందురని యేసు చెప్పెను (యోహాను 8:31).

ఆరవదిగా, శిష్యుడు ఫలించు వాడైయుండాలి. యోహాను 15:8లో యేసు, "మీరు బహుగా ఫలించుట వలన నా తండ్రి మహిమ పరచ బడును. ఇందువలన మీరు నా శిష్యులగుదురని" తన శిష్యులకు చెప్పెను.

ఏడవదిగా శిష్యుడు తన సహోదరులను ప్రేమించును. యోహాను 13:35లో "మీరు ఒకని యెడల ఒకడు ప్రేమ గలవారైన యెడల దీనిని బట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసికొందురని" యేసు చెప్పెను.

అవును శిష్యత్వము యొక్క బాధ్యతలు గొప్పవి. ఈ బాధ్యత లన్నియు తప్పక నెరవేర్చబడాలి. మనం వాటిని నెరవేర్చకపోతే నరక ద్వారములు మనలను ఎన్నటికీ మ్రింగివేస్తాయి.

-జాన్‌స్టేన

# అధికారులకు లోబడి యుండుట

## (Submission to Governing Authority )

ఇహపరములయందు యేసుక్రీస్తు సంపూర్ణాధికారము కలిగి యున్నారని క్రైస్తవులు బాగుగా ఎరుగుదురు. యేసు తన శిష్యుల వద్దకు వచ్చి "పరలోక మందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది" యని చెప్పెను (మత్తయి 28:18). యేసు మన ప్రభువు, రాజునైయున్నారు (1తిమోతి 6:15), మన రక్షకుడు (తీతుకు 2:13), మన ఉత్తరవాది (1యోహాను 2:1), మన విమోచకుడు (ఎఫెసీ 1:7) మన సహోదరుడు (రోమా 8:17), మరియు మన నిరీక్షణ (1 తిమోతి 1:1). మనము యేసుకు సంపూర్తిగ నిత్యము రుణస్థులమై యున్నాము. మరియు ఆయన నుండి దీవెనలు పొందవలెనంటే మనము ఆయనకు సంపూర్తిగలోబడి యుండాలి. క్రీస్తు రాజ్యము ఈలోకసంబంధమైనది కాదు. అది ఆత్మీయ రాజ్యము.

అయితే ఈ లోకసంబంధమైన అధికారము, ప్రభుత్వము సంగతి యేమిటి? మానవుల నియమముల యెడల మనం ఎట్టి స్వభావము కలిగి యుండాలి? రోమా 13:1-7లో అపో.పౌలు ఇట్లు హెచ్చరించాడు. "ప్రతివాడును పై అధికారులకు లోబడి యుండవలెను. ఏలయనగా దేవుని వలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు; ఉన్న అధికారములు దేవుని వలననే నియమింపబడి యున్నవి. కాబట్టి అధికారమును ఎదిరించువాడు దేవుని నియమమును ఎదిరించుచున్నాడు; ఎదిరించువారు తమ మీదికి తామే శిక్షతెచ్చుకొందురు. ప్రభుత్వము చేయు వారు చెడ్డకార్యములకే గాని మంచి కార్యములకు భయంకరులు కారు, నీకు మేలు కలుగుటకు అధికారులు దేవుని పరిచారకులు, వారికి భయపడక ఉండ గోరితివా, మేలు చేయుము. అప్పుడు వారిచేత మెప్పుపొందుదువు. నీవు చెడ్డది చేసిన యెడల భయపడుము, వారు ఊరకయే ఖడ్గము ధరింపరు. కీడు చేయువాని మీద ఆగ్రహము చూపుటకై వారు ప్రతికారము చేయు దేవుని పరిచారకులు. కాబట్టి ఆగ్రహమును బట్టి కాక మనసాక్షిని బట్టియు లోబడి యుండుట ఆవశ్యము. ఏలయనగా వారు దేవుని సేవకులై యుండి యెల్లప్పుడు ఈ సేవయందే పని కలిగియుందురు. ఇందుకే గదా మీరు పన్నుకూడ చెల్లించుచున్నారు! కాబట్టి యెవనికి పన్నో వానికి పన్నును, ఎవనికి సుంకమో వానికి సుంకమును చెల్లించుడి. ఎవని యెడల భయముండ వలెనో వాని యెడల భయమును,

ఎవని యెడల సన్మానముండవలెనో వాని యెడల సన్మాముును కలిగి యుండుడి. అందరికిని వారి వారి రుణములను తీర్చుడి".

ప్రపంచమందంతటా అనేక జనాంగములను పాలించు నిమిత్తము ప్రభుత్వములున్నవి. ప్రభుత్వములు వేర్వేరు విధములుగా యుండవచ్చును. కొందరు నిరంకుశపాలకులు, కొందరు ప్రజాస్వామ్యపాలకులు, ప్రభుత్వము లతో సంప్రదించునప్పుడు క్రైస్తవులు జాగ్రత్త వహించవలెను, ఎవరికి సన్మానమో వారిని సన్మానించవలెను. ఎవరికి భయపడవలెనో వారికి భయ పడవలెను. నమ్మకమైన క్రైస్తవులుగా యుండవలెను. దేవుడే మనలను సంరక్షించును. ఆయన చిత్తము జరిగించుట కొరకు ఆయన మానవుల ప్రభుత్వములను వినియోగించును.

చెడ్డ ప్రభుత్వముల సంగతి యేమిటి? దేవుని వాటిని చూచు కొంటారు. మనం మాత్రం మేలు చేయుట యందును, నమ్మకముగా యుండుట కును కొనసాగాలి. చెడును చేయువారు భయపడుదురు. వారు దేవుని వాక్యము ప్రకారము ఫలిత మొందుదురు. ఈ విషయములలో మనం యేమిచేయ నక్కర్లేదు, ఆందోళన చెందనవసరం లేదు. అనైతిక చర్యలను, అక్రమ క్రియలను ప్రోత్సహించు ప్రభుత్వముల సంగతి యేమిటి? మరల, సమస్తము దేవుని చేతిలో యున్నది. దుష్ట ప్రభుత్వములను, వారికి సపోర్టుచేయు వారిని ఆయన తప్పక తీర్పుతీర్చును. నీదేశ చట్టములను గౌరవించుము, పన్ను చెల్లించుము, మేలుచేయుము. ఆయన ప్రజలనందరిని ఆయన దీవించును, సంరక్షించును. దుష్ట ప్రభుత్వాన్ని సపోర్టుచేసే క్రైస్తవుని సంగతియేమిటి? దేవుడు నీతిమంతు లను దీవించి, దుష్టులను శిక్షించును. మనం ఓరిమి కలిగి యుండాలని హెచ్చరింపబడ్డాము.

దేవుడు సొలొమోనుకు తన ప్రభుత్వము విషయమై యిచ్చిన హెచ్చరిక లను మనందరము గమనించాలి. "నా పేరుపెట్టబడిన నా జనులు తమ్మును తాము తగ్గించుకొని ప్రార్థనచేసి నన్ను వెదకి తమ చెడు మార్గములను విడిచిన యెడల ఆకాశము నుండి నేను ప్రార్థనను విని వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును" (2 దినవృ 7:14). దేవుని వ్యతిరేకించు వారు తప్పక భయముతో జీవించవలెను. దుష్ట కార్యములను ప్రోత్సహించువారి పైకి దేవుని ఆగ్రహము వచ్చును. మన దేశము యొక్క భవిష్యత్తు మన దేవుని ప్రజల చేతిలో యున్నది. మనం నమ్మకముగా యుంటే, దేవుడు మన దేశమును బాగుచేయును

– వెయిన్ బేరియర్

# యెహోవా సేవకుడు

## (The Servant of the Lord)

యెహోవా సేవకుడైన మోషేను గూర్చి ద్వితీ 34:5లో చెప్పబడి యున్నది. అయినను అతడు వాగ్దానము చేయబడిన దేశములోనికి ప్రవేశింపలేకపోయెను. ఇశ్రాయేలీయులు కాదేషుకు వచ్చుసరికి దేవునికి వ్యతిరేకముగా సణగిరి. వారి యొక్క అభియోగములను గూర్చియేమి చేయాలోయని మోషే దేవునినడిగెను (సంఖ్యా 20). మోషే ప్రజలను అక్కడున్న బండ యొద్ద సమకూర్చి, ఆ బండతో మాట్లాడవలెనని దేవుడతనికి తెలియజేసెను. మోషే ప్రజలమీదనున్న అగ్రహముతో వారితో అట్లు మాట్లాడి, ఆ బండతో మాట్లాడుటకు బదులు దానిని తన కర్రతో కొట్టెను. ఆ సందర్భమును సంఖ్యా 20:9-12లో మనము ఇట్లు చదువవచ్చును.

"యెహోవా అతనికాజ్ఞాపించినట్లు మోషే ఆయన సన్నిధినుండి ఆ కర్రను తీసికొనిపోయెను. తరువాత మోషే అహరోనులు ఆ బండ యెదుట సమాజమును పోగుచేసినప్పుడు అతడు వారితో ద్రోహులారా, వినుడి; మేము ఈ బండలో మీకు నీళ్లు రప్పింపవలెనా? అనెను. అప్పుడు మోషే తన చెయ్యి ఎత్తి రెండుమారులు తన కర్రతో ఆ బండనుకొట్టగా నీళ్ళు సమృద్ధిగా ప్రవహించెను; సమాజమును పశువులును త్రాగెను, అప్పుడు యెహోవా మోషే అహరోనులతో మీరు ఇశ్రాయేలీయుల కన్నుల యెదుట నా పరిశుద్ధతను సన్మానించునట్లు నన్ను నమ్మకపోతిరి గనుక ఈ సమాజమును నేను వారికిచ్చిన దేశములోనికి మీరుతోడుకొనిపోరని చెప్పెను". మోషే తన క్రియ ద్వారా దేవుని ఘనపరచలేదు, అక్కడ అవిశ్వాసిగా అగుపడ్డాడు. దేవుని మాటలను బట్టి చేయకపోయినందున అతడు వాగ్దానము చేయబడిన దేశములో ప్రవేశింప లేకపోయెను.

తాను దానిలో ప్రవేశించునట్లును, తన విమోచన క్రియను సంపూర్తి చేయగల్గునట్లును జరిగించుమని మోషే దేవునికి విజ్ఞాపనచేసెను. మిమ్మును బట్టి యెహోవా నా మీద కోపపడెనని మోషే ఇశ్రాయేలీయులకు తెలియజేసెను (ద్వితీ 1:37). అయితే మోషే యెరికో యెదుటనున్న పిస్గా కొండవరకు

పోయి దానిపై నుండి దేవుడు ఇశ్రాయేలీయులకుగ్రహించు దేశమును చూడగల్గునట్లు దేవుడతనికి సెలవిచ్చెను. మరియు అతని తరువాత యెహోషువాను నాయకునిగా నియమించెను.

యెహోవా మాట చొప్పున మోషే మృతిబొందెను (ద్వితీ 34:5). యెహోవా మాట చొప్పున అనగా యెహోవా యొక్క ముద్దుతో మోషే మృతి బొందెను. పరమండలి తండ్రియైన దేవుని ముద్దుతో మోషే నిద్రించెను. దేవుడే అతని శరీరమును ఎవరికీ తెలియని ప్రదేశమందు పాతిపెట్టెను. మోషే చనిపోవుసరికి 120 సంవత్సరముల వయస్సు గలవాడు. అతనికి దృష్టి మాంద్యములేదు, అతని సత్తువ తగ్గలేదు.

ఇది మనకు చాలా మంచి పాఠము. నేను దేవుని సేవకుడనైనను పరలోకము పోగొట్టుకొనగలను. ఆయనకు విధేయత చూపకపోతే అట్లు జరుగును. అయితే మనం మారుమనస్సు పొందితే దేవుని ముద్దుతో ప్రభువు నందు నిద్రించగలము.

- గేరీ హేంప్టన్

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2015-17**
Date of Posting: 14 & 15th every month

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004